# మా ఉసురు తగులుతుంది..

- ఉచిత బస్సు ప్రయాణ నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వంపై ఆటోడ్రైవర్ల ఆగ్రహం
- పలు మండలాల్లో ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో ధర్నా



సాటాపూర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్లు

రెంజల్/ ధర్పల్లి/ ఖలీల్‌వాడి, డిసెంబర్ 13 : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచితం ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడంతో ప్యాసింజర్లు లేక తమ బతుకు బండి రోడ్డున పడిందని ఆటో డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. మహాలక్ష్మీ పథకాన్ని సవరించడంతోపాటు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో యునియన్ ఆధ్వర్యంలో నవీపేట- కందకుర్తి ప్రధాన రోడ్డు బైఠాయించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యునియన్ మండల అధ్యక్షుడు సయ్యద్ మాట్లాడుతూ.. మహాలక్ష్మీ పథకం అమలుయడంతో మండలంలోని 300 ప్యాసింజర్ ఆటోలు మూలన పడ్డాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తమ కుటుంబాల ఉసురు తగులుతుందన్నారు. తమకు న్యాయం చేయకపోతే ప్రజాదర్బార్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు.

ధర్పల్లి, సిరికొండ మండలాలకు చెందిన ఆటో డ్రైవర్లు ధర్పల్లి మండలకేంద్రంలో గాంధీచౌక్ నుంచి ప్రధానవీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ చౌక్ వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం పథకంతో ఉపాధి కోల్పోతున్నామని, తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. పురుషులు బైక్, కార్లలో, మహిళలు బస్సుల్లో వెళ్తుండడంతో తమకు ఉపాధి లేకుండా పోతున్నదన్నారు. తమ కుటుంబాలు రోడ్డున పడకుండా చూడాలని కోరారు.

జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆటోడ్రైవర్లు నిరసన చేపట్టారు. ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు సాయిలు మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో రాష్ట్రంలోని లక్షలాది ఆటోడ్రైవర్లు తమ జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తమకు తగిన పరిష్కారం చూపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బచ్చల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు షేక్ షాదుల్ పాషా, అబ్దుల్ గఫార్, మహ్మద్ మొయిన్, మర్రి భాస్కర్, షేక్ సలీం, షేక్ రఫీక్, దొడ్ల సాయిలు, షేక్ నబీ, షేక్ అబ్దుల్ బబ్బర్ పాల్గొన్నారు.



ధర్పల్లిలో ఆటో డ్రైవర్ల ర్యాలీ

## యూఏఈలో కార్తికమాస వనభోజనాలు



వనభోజనాల్లో పాల్గొన్న ఆర్యవైశ్యులు

డిచ్‌పల్లి, డిసెంబర్ 13 : కార్తికమాస చివరి వారం సందర్భంగా యూఏఈలోని రెనాడ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆర్యవైశ్యులు వనభోజనాల కార్యక్రమాన్ని బుధవారం జరుపుకొన్నారు. మొత్తం 815 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యాంకర్లు స్రవంతి, శరణ్య ఆధ్వర్యంలో ఆటల పోటీలు, తంబోలా కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు బలుసా వివేకానంద్, పాల్తి శ్రీనివాస్ నెల రోజుల ముందు నుంచే ఏర్పాట్లు చేశారు.

## మినీ క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ దవాఖాన సిబ్బంది

శక్కర్‌నగర్, డిసెంబర్ 13: బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానలో సిబ్బంది బుధవారం మినీ క్రిస్మస్ వేడుకలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. వేడుకల్లో దవాఖాన సూపరింటెండెంట్ శోభ, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రహీం సోఫీ, హెడ్ నర్స్ ప్రమీల, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వెసెక్టమీ శిబిరంపై అవగాహన కల్పించాలి: డీఎంహెచ్‌వో




వైద్యులు, సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో సుదర్శనం

శక్కర్‌నగర్, డిసెంబర్ 13: కుటుంబ నియంత్రణలో భాగంగా ఈ నెల 19న బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానలో వెసెక్టమీ శిబిరం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో సుదర్శనం తెలిపారు. బుధవారం దవాఖానలో వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పురుషులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసుకునేలా పీహెచ్‌సీలు, ప్రభుత్వ దవాఖానాల పరిధిలోని విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా సంక్రమిస్తున్న వ్యాధులు, జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య, డాక్టర్ సమత, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కాపాడాలని వినతి

నిజామాబాద్ రూరల్, డిసెంబర్ 13 : మండలంలోని కాలూర్ జడ్పీహెచ్‌ఎస్ స్థలాన్ని కాపాడాలని పీడీఎస్‌యూ నగర కమిటీ నాయకులు మున్సిపల్ కమిషనర్ మకరంద్‌కు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. కాలూర్‌లోని ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. సుమారు రూ. 2 కోట్ల విలువ చేసే ఎకరానికిపైగా స్కూల్ స్థలాన్ని ఇతరులకు వదిలేసి, గతేడాది ప్రహరీ కట్టే ప్రయత్నం చేశారని తెలిపారు. గతంలో ఈ విషయమై కలెక్టర్, ఎమ్మెల్యేతోపాటు డీఈవో, ఏడీ ల్యాండ్స్ అండ్ సర్వే డిపార్ట్‌మెంట్ అధికారికి ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆదేశానుసారం ఏడీ ల్యాండ్ సర్వే పాఠశాల స్థలానికి సర్వే చేసి హద్దులు నిర్ణయించారని తెలిపారు. మళ్లీ స్కూల్ స్థలాన్ని కబ్జా చేసి రోడ్డు వేసుకోవాలని చూస్తున్నారని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు, ఎస్‌కే అషూర్, రాజేశ్వర్, సృజన్ పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న కండక్టర్



ప్రయాణికుడు పోగొట్టుకున్న వస్తువులను తిరిగి అప్పగిస్తున్న కండక్టర్ సుచరిత్

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్ 13: ఆర్మూర్ డిపోలో విధులు నిర్వహిస్తున్న కండక్టర్ సుచరిత్ ప్రయాణికులు మర్చిపోయిన విలువైన వస్తువులను తిరిగి అప్పజెప్పి నిజాయితీ చాటుకున్నాడు. రెండు రోజుల క్రితం ఆర్మూర్ నుంచి నందిపేట్‌కు వెళ్తున్న సర్వీసులో ఓ ప్రయాణికుడు మొబైల్, పర్స్ మర్చిపోగా వాటిని బాధితుడికి ఇచ్చేశాడు. తాజాగా బుధవారం ఆర్మూర్-వేల్పూర్ సర్వీసులో ఓ ప్రయాణికురాలు తన పర్సును మర్చిపోయింది. పర్సులో అరతులం బంగారం, రూ.3,800 నగదు, ఏటీఎం ఉన్నట్లు గుర్తించాడు. ప్రయాణికురాలి వివరాలు తెలుసుకొని పర్సును అందజేశాడు. ఈ సందర్భంగా కండక్టర్ సుచరిత్‌ను పలువురు అభినందించారు.

## నగర అభివృద్ధిపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

ఖలీల్‌వాడి, డిసెంబర్ 13 : నగర అభివృద్ధిపై అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. నగరంలోని రెవెన్యూ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన సమీక్షలో నగరంలోని వివిధ పథకాలు, ప్రగతి కార్యక్రమాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు అధికారులు పూర్తి సహకారమందించాలని కోరారు. తాను నగరంలో పర్యటించిన సందర్భంగా ప్రజలు ఎక్కువ మొత్తంలో విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు, వీధిదీపాలు, ఉద్యానవనాలు, ఐలాండ్స్, బస్తీ దవాఖానలు, పెన్షన్లు, రేషన్‌కార్డుల వంటి మౌలిక వసతులకు సంబంధించి విన్నవించినట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమస్యల పరిష్కారానికి తోడ్పాటునందించాలని సూచించారు. ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేందుకు కృషిచేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఆర్డీవో రాజేంద్రకుమార్, మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ రవీందర్‌రెడ్డి, డీఈవో దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

## రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

శక్కర్‌నగర్, డిసెంబర్ 13: నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సంఘ ప్రతినిధులు కోరారు. బోధన్ పట్టణంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్ జమ చేయాలని, పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని కోరారు. అనంతరం సమస్యల పరిష్కారానికి తీర్మానం చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్లు

## ఆర్మూర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



మార్కెట్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్ టౌన్, డిసెంబర్ 13: పట్టణంలో నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి బుధవారం మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కోట్ల రూపాయలతో నిర్మించిన మార్కెట్ బిల్డింగ్‌ను వీలైనంత త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కరిస్తామని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ఆయన వెంట నాయకులు, ఉపాధ్యాయులు ఉన్నారు. ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ అలుక కిషన్ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసారు.